

ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 డిసెంబరు 2024



పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద కొనుగోలు చేసిన పత్తి

సీసీఐ కేంద్రాల్లో దళారులు

- జిన్నింగ్ మిల్లు యజమానులు చెప్పిందే వేదం
- 2 లక్షల హెక్టార్లలో సాగైన పత్తి 70 శాతం ప్రైవేటు వ్యాపారులకే
- నామ్‌కే వాస్తేగా సీసీఐ కొనుగోళ్లు
- తేమ రంగు మారిందని సాకులతో వద్దంటున్న అధికారులు
- దళారులు ఇచ్చేది రూ.6వేల నుంచి రూ.6,500 వరకే

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ సంవత్సరం 2 లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. గత దశాబ్ద కాలంగా రాని దిగుబడి ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వచ్చింది. అయితే.. దిగుబడి బాగున్నా ధర లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే.. నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు కాక ఆ జిల్లా రైతులు మద్దతు ధరను పొందేందుకు కర్నూలు జిల్లాలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. సీసీఐ కేంద్రంలో క్వింటం పత్తికి రూ.7,521 లభిస్తుందన్న ప్రచారం తప్ప.. వాస్తవానికి ఆ ధర ఇవ్వడం లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. సీసీఐ కేంద్రాల్లో దళారులు తిష్ట వేసి రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు న్యాయం జరగడం లేదు. తేమ శాతం 8 నుంచి 12 శాతం లోపు ఉంటేనే ఈ ధర ఇస్తున్నారు. ప్రస్తుతం ముసురుతో పాటు మంచు కురుస్తుండటం వల్ల మినిమం ఈ తేమ ప్రతి రైతు తెచ్చిన పత్తికి ఉండటం వల్ల సీసీఐ కేంద్రం వారు ఏ మాత్రం నిబంధనలను సడలించేది లేదని రైతులను వెనక్కి పంపించేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గత నెల కేంద్ర మంత్రికి నిబంధనలను సడలించి సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని లెటరు రాశారు. ఒక వారం రోజుల పాటు సీసీఐ అధికారులు కొంత వరకు నిబంధనలను సడలించినా ఈ నెల మొదటి వారం నుంచి తేమ నిబంధనల ప్రకారమే ఉండాలని గిరిగీశారు. దీంతో రైతులు దళారులను జిన్నింగ్ మిల్లులను ఆశ్రయించి ఎంతకో కొంత మేర అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. 2 లక్షల హెక్టార్లలో (6 లక్షల ఎకరాలు) సాగు చేసిన పత్తి పంటకు ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున 48 లక్షల క్వింటాళ్ల పత్తి రైతుల చేతికి అందింది. ఇందులో 35 లక్షల క్వింటాళ్ల దాకా పత్తి దళారులు, జిన్నింగ్ మిల్లులకే రైతులు అమ్ముకున్నారు. మిగిలిన 10 నుంచి 12 లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది.



సీసీఐ కేంద్రం వద్ద పత్తి రైతుల పడిగాపులు

మిగతా 6లో..

దళారులకే పంట

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట వాతావరణం అనుకూలించి రైతులకు దిగుబడి చేతి నిండా అందింది. సంతోషంతో రైతులు సంబరం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.7,521 అందుతుందని సంతోషించారు. వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటే అయింది. కర్నూలు జిల్లాలో 12 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కాగా, నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు కాలేదు. అయితే.. కర్నూలు జిల్లాలో 12 కేంద్రాలు ఉన్నా పది శాతం పత్తిని మాత్రమే రైతులు సీసీఐకి అమ్ముకోగలిగారు. నంద్యాల జిల్లా రైతుల పరిస్థితి మరీ దారుణం. ఈ గడ్డు పరిస్థితుల్లో రైతులు దళారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులను ఆశ్రయించక తప్పలేదు. సీసీఐ అధికారులు, మార్కెట్ కమిటీల అధికారులతో వ్యాపారులు దళారులు ముందే ఒప్పందం చేసుకున్నారు. కేంద్రాల వద్ద దళారులు తిష్ట వేశారు. పెంచికలపాడు కేంద్రం వద్ద రైతులకంటే దళారులే ఎక్కువ సంఖ్యలో కనిపించడం దారుణం. గ్రామాల్లో దళారులు, వ్యాపారులు తిష్ట వేసి రైతులకు అడ్వాన్సులు ఎర వేసి క్వింటానికి రూ.6వేలు మాత్రమే చేతుల్లో పెడుతున్నారు. రైతుల పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు తీసుకుని నేరుగా లారీల్లో పెంచికలపాడు సీసీఐ కేంద్రానికి వెళ్లి అక్కడ పత్తిని అమ్మి క్వింటంపై రూ.7,521 లబ్ధి పొందుతున్నారు. ఈ ప్రకారంగా క్వింటానికి రూ.1000 లాభం వస్తుంది. ఈ లాభంలో వ్యాపారులు కొంత మొత్తం మార్కెటింగ్ శాఖ అధికారులకు, సీసీఐ అధికారులకు ఇస్తుండటంతో ఈ భాగోతం ఎవరికీ తెలియడం లేదు. మద్దతు ధర అందుతుందో లేదో నిఘా పెట్టడంలో విజిలెన్స్ విభాగం అధికారులు పెద్దగా శ్రద్ధ తీసుకోవడం లేదు.

'విద్యుత్' ప్రైవేటీకరణ వద్దు

ఉద్యోగ జేఏసీ నాయకుల నిరసన



ధర్నా చేపట్టిన విద్యుత్ జేఏసీ నాయకులు

కల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఛండీఘర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో వారికి సంఘీభావంగా గురువారం జేఏసీ ఆధ్వర్యంలో కర్నూలు విద్యుత్‌భవన్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా అన్ని రంగాల్లో ప్రభుత్వం క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సమజసం కాదని తక్షణమే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల కోసం ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎస్పీ జి. బిందుమాధవ్ తెలిపారు. గురువారం ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే మైదానాన్ని ఎస్పీ పరిశీలించారు. మైదానంలో చేపట్టాల్సిన పనులపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ, ఇంటర్నెట్, వైద్యం వంటి వసతుల ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. 1600 మీటర్లు, లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగు పందెం ప్రదేశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు (పీఎంటీ/పీఈటీ) శారీరక ఫిజికల్ పరీక్షలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, ఏపీఎస్పీ అడిషినల్ కమాండెంట్ నాగేంద్రరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, షర్ఫుద్దీన్, మహబూబ్ బాషా, రమణ, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్కులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన వారోత్సవాలు - గ్రామాల వైపు పరిపాలన కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్కులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు గుడ్ గవర్నెన్స్ వీక్ - గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కీ ఓర్)ను నిర్వహించనున్న సందర్భంగా గురువారం నుంచి జిల్లాలో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలు చేరువ చేయడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో, ఎంపీడీవో కార్యాలయాల్లో, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం స్పెషల్ డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

వియోగి ఇకలేరు..!
అనారోగ్యంతో ప్రముఖ రచయిత కన్నుమూత
7



పీసీ పీఠం ఎవరికో..?
- రేపే ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
- టీబీపీ ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానానికి పోటీ
6

టమోరా

- భారీగా పతనమైన ధర
- రైతు బజార్లో కిలో రూ.8

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గతవారం కిలో రూ.50 పలికిన టమోటా ధర ప్రస్తుం అమాంతంగా పడిపోయింది. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనం కావడంపై టమోటా సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రైతు బజార్లో కిలో రూ.8 పడిపోయింది. వేలంపాటలో 18 కిలోల గంప రూ.100మించి రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. రోజురోజుకి ధరలు దిగజారడంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా కోయడానికి, రవాణా ఖర్చు ఇలా అన్నీ కలిపితే తమకు నష్టమేనని రైతులు వాపోతున్నారు.



విక్రయానికి వచ్చిన టమోటాలు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి
- 'పది' పరీక్షలపై కలెక్టర్ సమీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో డీఈఓ శామ్యూల్ పాల్ అధ్యక్షతన పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంపుపై ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అధికారులు, వార్డెన్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఎఫ్ఏ పరీక్షల్లో సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. కనీసం ఉత్తీర్ణత మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. గత ఏడాది పది పరీక్షలో గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులలో అధిక శాతం ఫెయిల్ అయ్యారని, ఈసారి ఈ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. ప్రశ్నలు, జవాబులు నేర్పించి వారాంతపు పరీక్షలు, రివిజన్ టెస్టులు నిర్వహించాలన్నారు.

సెలవులు రద్దు చేయండి

పదో తరగతి పరీక్షలకు ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉందని, వేల మంది విద్యార్థుల జీవితాలు ఈ పరీక్షలపై ఆధారపడి ఉన్నాయన్నారు. ఏ కారణం లేకుండా ఉపాధ్యాయులు సెలవుల్లో వెళ్లిఉంటే లీవ్స్‌ను రద్దు చేసి వారిని వెనక్కు రప్పించాలని డీఈవో శామ్యూల్ పాల్‌ను ఆదేశించారు. కౌతాళం,నాగులదిన్నె, గోవర్ధనగిరి, రామళ్లకోట, బిల్లేకల్ పాఠశాలల్లో పది ఉత్తీర్ణత అతి తక్కువగా ఉందన్నారు. ఈసారి అలా జరగడానికి వీల్లేదని, తక్కువ ఉత్తీర్ణత శాతం వస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కర్నూలు నగరంలోని సెయింట్ మేరీస్ ఎయిడెడ్ హై స్కూల్, కోల్స్ మెమోరియల్ పాఠశాల, ఈసీఎం పాఠశాల, పత్తికొండలోని బాల విద్యానికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో జీరో ఉత్తీర్ణత శాతం రావడం పట్ల కలెక్టర్ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎయిడెడ్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. టీచర్లు లేరనీ, విద్యార్థులను అలాగే వదిలేస్తారా అని ఉపాధ్యాయులను సుతిమెత్తగా మందలించారు. మీకు ఇబ్బందిగా ఉంటే ఆ పాఠశాలలోని విద్యార్థులను సమీపంలోని పాఠశాలలకు పంపించాలని డీఈవో శామ్యూల్ పాల్‌కు తెలిపారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ జిల్లాలో 521 పాఠశాలల నుంచి 38,448 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పది లో మెరుగైన ఫలితాలు సాదించేందుకు ఇప్పటికే ప్రణాళికలను రూపొందించి వాటి అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో డీఈవో శామ్యూల్ పాల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, డీసీవో శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడిగా బన్నూరు ఖరారు

- పేరును ప్రతిపాదించిన సీఎం చంద్రబాబు
- సమ్మతించిన కడప, కర్నూలు జిల్లాల ఎమ్మెల్యేలు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు - కడప కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి పేరును ప్రతిపాదిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ విషయంపై గురువారం ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలకు చెందిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య, గౌరు చరిత, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖరగౌడ్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా బన్నూరు రామలింగారెడ్డి పేరును సమష్టిగా ప్రతిపాదించారు. 21వ తేదీ శనివారం నంద్యాలలోని కేసీ కెనాల్ ఈఈ కార్యాలయంలో కేసీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక జరగనుంది. కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని మొత్తం 14 డీసీలకు చెందిన సభ్యులు ఓటింగ్‌లో పాల్గొంటారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 8డీసీలు ఉండగా, కడప జిల్లా పరిధిలో 6డీసీలు ఉన్నాయి. కాగా అన్ని డీసీల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంతో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడిగా కేసీసీ-3 వేల్పనూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ నుంచి ఎన్నికైన బన్నూరు రామలింగారెడ్డి ఎన్నిక కూడా ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి.



సీఎం చంద్రబాబును కలిసిన బన్నూరు రామలింగారెడ్డి, ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల ఎమ్మెల్యేలు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ మూల్యంకనం ఫలితాలను పరీక్షల విభాగాధిపతి డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పరీక్షల మూల్యంకనం కోసం 571 మంది దరఖాస్తు చేసుకోగా 122 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పరీక్షల విభాగాధిపతి తెలిపారు.

నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నంద్యాల, ఆదోని మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం మధ్యాహ్నం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ పాల్ వెల్లడించారు. అర్హులైన ఎస్జీటీ తెలుగు, ఉర్దూ ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు అర్హత గల వారు రెండు సెట్ల జిరాక్స్, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరు కావాలన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్ఏ-ఇంగ్లీషు, ఎస్ఏ-పీఎస్, ఎస్ఏ-బీఎస్-టీఎం-2, ఎస్ఏ-ఎస్ఎస్-టీఎం-1, ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే ఆదోని, నంద్యాల, మున్సిపల్ పరిధిలో ఎస్ఏ- మ్యాథ్స్-టీఎం-2, ఎస్ఏ-పీఎస్-టీఎం-3, ఎస్ఏ-బీఎస్-టీఎం-1, ఎస్ఏ-ఎస్ఎస్-టీఎం-1, ఎస్ఏ-ఎస్ఎస్-యుఎం-1 ఖాళీలు ఉన్నట్లు డీఈఓ తెలిపారు.



మాట్లాడుతున్న డీఈఓ

సాగునీటి సంఘాల ఎన్నికల్లో చివరి ఘట్టానికి సమయం ఆసన్నమైంది. మూడు దశల్లో జరిగే ఎన్నికల్లో సాగునీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ), డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఇక కీలకమైన ఎల్లెల్సీ జీడీపీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ రెండు ఎన్నికలు జలమండలి కార్యాలయంలో జరగనున్నాయి. ఎన్నికల నోడల్ అధికారి, ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికకు సంబంధించి తాజాగా కలెక్టర్ పి. రంజిత్ బాషా నోటిఫికేషన్ జారీ చేశారు.



జీడీపీ పీసీ చైర్మన్ కేఈకేనా?

గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ పరిధిలో 12 డబ్ల్యూయూఏలు ఉన్నారు. పీసీ చైర్మన్‌గా కోడుమూరు డబ్ల్యూయూఏ-2 అధ్యక్షుడు కేఈ మల్లికార్జున గౌడు పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. కృష్ణగిరి మండలం పోతుగల్లు డబ్ల్యూయూఏ అధ్యక్షుడు సోములగౌడు కూడా ఆశించినా, మల్లికార్జున గౌడుకే ముఖ్యమైన నాయకులు మద్దతు ఇవ్వడంతో ఆయన ఎంపిక లాంఛనమే అని టీడీపీ వర్గీయులు అంటున్నారు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

- రేపే ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
- టీబీపీ ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానానికి పోటీ
- గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీపై సర్వత్రా ఆసక్తి
- టీడీపీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

పీసీ పీఠం ఎవరికో..?

కర్నూలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు 17వ తేదీ మంగళవారం ముగిశాయి. ఎల్లెల్సీ పరిధిలో హోళగుంద డీసీ-1, కౌతాళం డీసీ-2, కోసిగి డీసీ-3, పెద్దకడుబూరు డీసీ-4, ఎమ్మిగనూరు డీసీ-5, 6, గోనెగండ్ల డీసీ-7, కోడుమూరు డీసీ-8, కర్నూలు డీసీ-9, 10 అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. పది మంది డీసీ అధ్యక్షులు సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నిక జరగాలంటే కనీసం ఐదుగురు హాజరు కావాలి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కమిటి పరిధిలో 12 మంది డబ్ల్యూయూఏలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో కనీసం 50 శాతం అంటే ఆరుగురు డబ్ల్యూయూఏల అధ్యక్షులు హాజరు కావాలని ఎన్నికల నిర్వహణ అధికారులు పేర్కొంటున్నారు. మరో పక్క..

అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..?

టీబీపీ-ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ (పీసీ) చైర్మన్ ఎవరన్నది టీడీపీ వర్గాల్లో ప్రధానంగా జరుగుతున్న చర్చ. ఈ రెండు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపికలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జిల ఏకాభిప్రాయం నిర్ణయం ఎంతో కీలకం. అయితే జిల్లాలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు తాగునీరు అందించే ఎల్లెల్సీ పీసీ చైర్మన్ పీఠం కోసం హోళగుంద డీసీ అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్, కౌతాళం డీసీ అధ్యక్షుడు పి.టిప్పుసుల్తాన్, పెద్దకడుబూరు డీసీ అధ్యక్షుడు నరవ రమాకాంత్ రెడ్డి, ఎమ్మిగనూరు డీసీ-6 అధ్యక్షుడు గోవర్దన్ రెడ్డి, కర్నూలు డీసీ-9 అధ్యక్షుడు కే.మహేశ్వరరెడ్డిలు ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. పోటీ అధికంగా ఉండటంతో చైర్మన్ అభ్యర్థి ఎంపిక బాధ్యతను పార్టీ అధిష్ఠానానికి వదిలేశారు. అధినేత సీఎం చంద్రబాబు ఆశీస్సులు ఉన్న వారే చైర్మన్ అయ్యే అవకాశం ఉంది. దీంతో పీసీ పీఠం ఎవరికి దక్కుతుందా? అన్న ఆసక్తి నెలకొంది.



అధినేత నిర్ణయమే ఫైనల్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి సంఘం అధ్యక్షుడి ఎంపిక అధినేత చంద్రబాబు నిర్ణయమే అంతిమమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన టీసీ, డీసీ సభ్యులను, గెలుపునకు కృషి చేసిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలను సన్మానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మద్దతు పలికిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికపై సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా నాయకులు సూచించిన పేర్లను పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

సన్నజాజి.. రేటు జాస్తి



రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సన్నజాజి పూల ధర ఆకాశాన్నంటుతోంది. కిలో రూ.800 నుంచి వెయ్యి పలుకుతోంది. వ్యాపారులు సైతం వీటిని కొనాలంటే జంకుతున్నారు. ఇంత ధర పెట్టి కొనడానికి ఎవరూ ముందుకు రారని వారు పేర్కొంటున్నారు. సాగు తక్కువ కావడమే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. పైగా సన్నజాజి పూలకు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉండడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు.

ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేయండి

జాయింట్ కలెక్టర్ నవ్య

వెల్దుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పొలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్య తహసీల్దార్ చంద్రశేఖరవర్మను ఆదేశించారు. గురువారం వెల్దుర్తి మండలం ఎస్. బోయనపల్లె గ్రామంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు. అబ్దుల్ హుసేన్ అనే రైతు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చాడు. ఇందులో ఆయన... సర్వే నెంబరు 9లో 3 ఎకరాలు ప్రభుత్వం తనకు డీ పట్టా ఇచ్చిందన్నారు. టైటిల్ డీడ్, అడంగల్, పాసుబుక్‌లో రికార్డుపరంగా అన్నీ తనకు ఉన్నాయని, అయితే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భూమిని ఆక్రమించాడని జాయింట్ కలెక్టర్ నవ్యకు విన్నవించుకున్నాడు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ... కబ్జా చేసిన వ్యక్తిపై 109 సీఆర్పీసీ సెక్షన్ కింద బైండోవర్ కేసు నమోదు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖరవర్మను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు కాంతారెడ్డి, సర్వేయర్ హేమంత్‌రెడ్డి, ఆర్ఐమస్తాన్, విఆర్వో ఉమన్న, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఉత్తమ సేవలకు ఉపాధ్యాయ రత్న అవార్డు

హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అద్దంకి చంద్రమోహన్

తుగ్గలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు చదువు చెప్పడంలో అంకిత భావం ప్రదర్శించినందుకు అద్దంకి చంద్రమోహన్‌కు ఉపాధ్యాయ రత్న అవార్డును ప్రకటించారు. మండలంలోని లక్ష్మీతాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అద్దంకి చంద్రమోహన్ హైదరాబాదులో ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అందించిన ఉపాధ్యాయ రత్న అవార్డును హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ రత్న పురస్కారం అవార్డుకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. అవార్డు అందుకున్న చంద్రమోహన్‌ను ఎంపీపీ ఎర్రనాగప్పతో పాటు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



అవార్డు తీసుకుంటున్న అద్దంకి చంద్రమోహన్

సీసీఐ కేంద్రాల్లో దళారులు



(5వ పేజీ తరువాయి)

నంద్యాల జిల్లాలో సీసీఐ అధికారులు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ జిల్లాలో రైతులు పత్తిని లారీలు, ట్రాక్టర్లలో వ్యయ ప్రయాసలకోర్చి కర్నూలు జిల్లాలోని పెంచికలపాడులోని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఖర్చులకు ఒక ట్రాక్టర్ దాదాపు 5 నుంచి రూ.6వేల దాకా ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. 3, 4 రోజుల పాటు ఆ కేంద్రం వద్ద చలికి ప్రాణాలు పోయేంతగా పడిగాపులు కాస్తున్నా సీసీఐ అధికారులు ఏ మాత్రం కనికరం లేకుండా నిబంధనల పేరుతో కొనుగోలు చేయకుండా వెనక్కి తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఈ విషయాన్ని ముందుగానే పసిగడుతున్న జిన్నింగ్ మిల్లుల యజమానులు, దళారులు తాము గ్రామాల నుంచి తెచ్చిన పత్తిని అదే నిబంధనల ప్రకారం పత్తి లేకున్నా సీసీఐ కేంద్రం వద్ద క్వింటానికి రూ.7,521 దక్కించుకోవడం దారుణం. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులను ప్రశ్నించినా వారికి న్యాయం జరగడం లేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పత్తి దాదాపు 70 శాతం దళారులు, జిన్నింగ్ మిల్లుల పరమైపోయింది. కేవలం 30 శాతం మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది.

రైతుల కంటే దళారులే ఎక్కువ

కర్నూలు జిల్లాలో రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసేందుకు 12 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద రైతులకంటే వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులే అధికంగా ఉండటం విశేషం. వీరు చెప్పిందే వేదం అన్నట్లుగా సీసీఐ అధికారులు వ్యవహరిస్తున్నారు. వారానికి ఒకసారి మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది సీసీఐ కేంద్రాలకు ఉజ్జాయింపుగా వెళ్లి వస్తుండటం దారుణం. అధికారులే తమకు తీరని అన్యాయం చేస్తున్నారని, పేరుకే మాత్రమే ప్రభుత్వం మద్దతు ధర అందిస్తున్నట్లు చెప్పుకోవడం తప్పితే.. తమకు ఎక్కడ న్యాయం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోలు



కర్నూలు జిల్లాలో రైతుల నుంచి పత్తిని నిబంధనల ప్రకారమే సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్నది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే ప్రభుత్వం ప్రకటించినట్లు క్వింటానికి రూ.7,521 రైతులకు దక్కుతుంది. తేమ అధికంగా ఉంటే సీసీఐ కొనదు. నిబంధనల మేరకు అర్హులు కాని రైతులు జిన్నింగ్ మిల్లులకు అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో దళారులు, ఇతర వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు తమకు సమాచారం లేదు. దళారులు అమ్ముతున్నట్లు మాకు ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. సీసీఐ కేంద్రాల వద్ద దళారులు తిష్ట వేసినట్లు ఫిర్యాదులు రాలేదు. వివిధ మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది సీసీఐ కేంద్రాల వద్దనే ఉండి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

\- నారాయణమూర్తి, ఏడీఎం

కాగితాల్లోనే పత్తికి మద్దతు ధర



సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర వ్యాపారులు, మిల్లుల యజమానులకు తప్పితే.. రైతులకు అందడం లేదు. గ్రామాల్లో దళారులు తిష్ట వేసి క్వింటానికి రూ.6వేల ధరను నిర్ణయిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని సీసీఐ కేంద్రం వద్ద వారే మద్దతు ధరను పొందుతున్నారు. మార్కెట్ కమిటీల అధికారులు, సీసీఐ అధికారులు దళారులతో చేతులు కలపడం వల్లనే రైతులకు అన్యాయం జరుగుతున్నది.

\- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకోవాలి



కంది పంటలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు


బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతలు వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ అన్నారు. గురువారం బనగానపల్లె సమీపంలోని యాగం టిపల్లె కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేవీకేలో ఎక్కువ మంది రైతులకు సాంకేతికతను అందజేయాలని, అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకోవాలని కోరారు. కేవీకే చేపట్టిన విత్తనోత్పత్తి ప్రద ర్శనా క్షేత్రాలను పరిశీలించారు. నియోజక వర్గంలోని అమడాలో గల కంది రకాలు, కలుగొట్లలోని శనగ విత్తనోత్పత్తి ప్రదర్శనా క్షేత్రాన్ని గుండుపాపలలో సాగు చేసిన మినుము విత్తనోత్పత్తి ప్రదర్శనా క్షేత్రా లను స్వయంగా పరిశీలించారు. మహిళలు నడుపుతున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ కేంద్రాలను సందర్శించి రైతులకు తగు సూచ నలు చేశారు. సురేశ్‌కుమార్, కెవికె శాస్త్రవేత్తలు రమణ య్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయ ణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 512 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 27 గ్రామాల్లోని రెవెన్యూ సదస్సుల్లో 512 అర్జీలను స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో 17, నందవరం మండలంలోని ఇబ్రహీంపురంలో 7, ఎమ్మిగనూరు మండలంలోని ఏనుగుబాలలో 26, కోసిగి మండలంలోని ఐరన్‌గల్ గ్రామంలో 28, మంత్రాలయం మండలంలోని మంచాల గ్రామంలో 2, పెద్దకడుబూరు మండలంలోని పీకలబెట్ట గ్రామంలో 9, ఆదోని మండలంలోని చిన్నగోనెహాల్‌లో 11, హోళగుంద మండలంలోని సుల్వాయి గ్రామంలో 16, కోసిగి మండలంలో దేవరబెట్ట గ్రామంలో 28, కౌతాళం మండలంలోని బదినేహాల్‌లో 48, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని కేతవరంలో 17, కల్లూరు మండలంలోని కొంగనపాడు గ్రామంలో 6, వెల్దుర్తి మండలంలోని ఎస్. బోయినపల్లి గ్రామంలో 17, కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో 11, కర్నూలు రూరల్‌లోని ఉల్చాల గ్రామంలో 91, గూడూరు మండలంలోని మల్లాపురం గ్రామంలో 7, సి.బెళగల్ మండలంలోని కుంబళహల్లిలో 5, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలంలోని పత్తికొండలో 25, తుగ్గలి మండలంలోని పగిడిరాయిలో 8 క్రిష్ణగిరి మండలంలోని కంబలపాడులో 41, మద్దికెర మండలం ఎం.అగ్రహారం గ్రామంలో 23, ఆలూరు మండలంలోని కరిడిగండంలో 16, చిప్పగిరి మండలంలో చిప్పగిరిలో 14, ఆస్పరి మండలంలోని నగరూరు లో 19, హాలహర్వి మండలం కమినహాల్‌లో 5, మెడికల్ గ్రామంలో 1, దేవనకొండ మండలంలోని పాలకుర్తిలో 15 అర్జీలు వచ్చాయన్నారు. ఇంటి స్థలాలకు సంబంధించి 1, అలాగే 22ఏలో ఉన్న నిషిద్ధ భూముల జాబితాకు 1, రీ సర్వేకు 55, మీసేవా గ్రీవెన్స్‌కు 8, ఇనాం భూములకు 3, ఆర్వోఆర్ కేసులకు 383, ఇతరాలు 55, రోడ్ల వివాదాలకు సంబంధించి ఒక అర్జీ వచ్చాయన్నారు.

డీఎల్‌డీఓ కార్యాలయంలో సిబ్బంది కొరత

- సచివాలయాల పర్యవేక్షణ జీఎస్‌డబ్ల్యూదే బాధ్యత
- పట్టించుకోని అధికారులు



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆవరణలోని కర్నూలు డివిజన్ డీఎల్‌డీఓ(డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారి) సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. డివిజన్ పరిధిలోని 7 మండలాలు, రెండు మున్సిపాలిటీలు(కర్నూలు నగర పాలక సంస్థ, గూడూరు మున్సిపాలిటీ)లకు సంబంధించి సచివాలయాల్లో జరుగుతున్న పథకాల అమలును డీఎల్‌డీఓ పర్యవేక్షించాలి. అయితే కార్యాలయంలో డీఎల్‌డీఓతోపాటు పరిపాలన అధికారి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, అటెండర్ ఉండాలి. ప్రస్తుతం డీఎల్‌డీఓ, పరిపాలన అధికారి, అటెండరు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం మండలాలలోని సచివాలయాలో జరుగుతున్న పథకాల అమలు తీరును పర్యవేక్షించడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలి. ఈ క్రమంలో ఒక్క పరిపాలన అధికారి వల్ల ఎలా సాధ్యమవుతుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత..

కార్యాలయ పరిధిలో పర్యవేక్షణ ఉన్నప్పటికీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ సీఈఓ జిల్లా మొత్తం పర్యవేక్షిస్తే...డీఎల్‌డీఓ మాత్రం కర్నూలు డివిజన్ వరకు పర్యవేక్షించాల్సి ఉంటుంది. డీఎల్‌డీఓ సచివాలయంలో జరిగే ప్రతి స్కీమ్‌ను మానిటర్ చేయడంతో పాటు ...సచివాలయాలకు వచ్చే ప్రతి జీఓను మెయిన్‌టెయిన్ చేయాలి. అయితే డీఎల్‌డీఓను ఉమ్మడి జిల్లా గ్రామ, వార్డు సచివాలయల పర్యవేక్షణ ఇన్‌చార్జి అధికారిగా కూడా నియమించారు. దీంతో ఆయన రెండు జిల్లాల సచివాలయాలను పర్యవేక్షించాల్సి ఉంది.

- డిప్యుటేషన్ ప్రాతిపదికన నియామకం..

డీఎల్‌డీఓ కార్యాలయంలో జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగులను డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించాలని గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తాత్కాలికంగానే ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (కుడా) ఫారిన్ సర్వీస్ కింద వెళ్లారు. దీంతో ఆ రెండు పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అంతే కాకుండా గత సంవత్సర కాలంగా టైపిస్టు పోస్టు ఖాళీగానే ఉంది. మిగతా ఉద్యోగులే టైపిస్టు పనులు కూడా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



జిల్లా పరిషత్ పాత పరిపాలన భవనంలో ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయం

డిప్యుటేషన్ వేయాలని ప్రతిపాదనలు పంపాం..

కార్యాలయంలో ఇబ్బంది కొరత ఉందని ప్రతిపాదనలు సీఈఓకు పంపాం. త్వరలోనే నియమిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు. ప్రస్తుతం పనులు సాఫీగానే సాగుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేవు. ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

\-జీవీ.రమణారెడ్డి, డీఎల్‌డీఓ, కర్నూలు డివిజన్

ఇద్దరిని నియమించాం



సిబ్బంది కొరత ఉందని డీఎల్‌డీఓ ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఓ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌ను నియమించాం. త్వరలోనే అక్కడ జాయిన్ అవుతారు. మిగిలిన ఖాళీలను త్వరలోనే పూర్తి చేస్తాం.

\-జి. నాసరరెడ్డి, జడ్పీ సీఈఓ

వియోగి ఇకలేరు..!

- అనారోగ్యంతో రచయిత కన్నుమూత
- నవలలు, కథా సంపుటాలతో గుర్తింపు


వియోగి (ఫైల్)

కర్నూలు కల్చరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ కథ, నవలా రచయిత 'వియోగి' గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. వియోగి కలం పేరుతో రచనలు చేసిన కోపల్లె విజయ ప్రసాదు (72) శ్వాసకోశ వ్యాధితో బాధపడతూ నగరంలోని శ్రీనగర్‌కాలనీ స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఎల్‌ఐసీ అధికారిగా 2012లో పదవీ విరమణ చేశారు.1952 జూలై 28న తెనాలిలో జన్మించారు. వృత్తిరీత్యా కర్నూలులో పనిచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. పలు నవలలు, కథా సంపుటాలు, వందకు పైగా రేడియో నాటికలు రాశారు. ఆయన కథలకు ఎన్నో బహుమతులు లభించాయి. కథా సంకలనాలు, హాస్య కథా సంకలనాలకు ఆయన సంపాదకత్వం వహించారు. 1992లో ఆకాశవాణి జాతీయ అవార్డు, 2016లో రాధాకృష్ణన్ స్మారక అవార్డు, ఎన్‌టీఆర్ అవార్డు, అదే ఏడాదిలోనే లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2017లో కువైట్ తెలుగు కళా సమితి అవార్డులు అందుకున్నారు. ఒకపక్క ఉద్యోగం చేస్తూనే ఎన్నో రచనలు చేశారు. వివాహ వీణ, ధీరనారి, బతుకు మొదలైన నవలలు, విలువలు, రస గుళికలు, మాబామ్మ కథలు మొదలైన కథా సంపుటాలు ఆయనకు పేరు తెచ్చాయి. వియోగి తండ్రి 'శ్రీరాగి', సోదరి డాక్టర్ రమ్య, ధర్మపత్ని విశాలాక్షి కూడా రచయితలే కావడం విశేషం. వియోగి మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా నాయకులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్, నాగమణి, అయ్యన్న, భాస్కర్, విజయులు, అరసం నాయకులు జహీర్ అహ్మద్, పుల్లా రామాంజినేయులు, ప్రమోద్, కవులు స్వరూప్ సిన్హా, మండి అన్వర్ హుస్సేన్, జేఎస్‌ఆర్‌కే శర్మ, కేసీ కల్కూర, ఇనాయతుల్లా, పౌరోహితం మారుతి, తెలుగు వెంకటేశ్, వెంకటక్రిష్ణ, డాక్టర్ హరికిషన్, నాగాంజనేయులు, రామ్‌చంద్, కల్యాణదుర్గం స్వర్ణలత సంతాపం తెలియజేశారు.

పత్తి అమ్మకానికి పడిగాపులు

- నిలిచిన పత్తి కొనుగోళ్లు
- సీసీఐ కేంద్రం వద్ద రైతుల ఆవేదన
- కొనుగోళ్లు లేక నిలిచిపోయిన పత్తి వాహనాలు


యంత్రానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ రైతు పేరు వెంకటస్వామి. బూడిదపాడు గ్రామం. రెండెకరాల్లో వచ్చిన పత్తి దిగుబడిని పెంచికలపాడులోని సీసీఐ పత్తి కేంద్రంలో అమ్మేందుకు మూడు రోజుల కింద వెళ్లాడు. ఇప్పటికీ అక్కడే పడిగాపులు పడుతున్నాడు. జిన్నింగ్ మిల్లులో ఎక్స్‌కవేటర్ ఒక యంత్రాన్ని ఢీకొట్టడంతో ఆ మిషన్ చెడిపోయి పత్తికొనుగోళ్లు నిలిచిపోయాయి. సోమవారం దాకా కొనుగోళ్లు జరగవని, ప్రస్తుతం టోకెను మాత్రమే ఇస్తామని అధికారులు ప్రకటించడంతో వందలాది మంది రైతులు పెంచికలపాడు కేంద్రం వద్దనే పడిగాపులు కాస్తున్నారు. ఓ వైపు తుఫాను తరుముకొస్తే పత్తి ఎక్కడ తడిసిపోతుందో అని ఆందోళనపడుతున్నారు. రెండు వాహనాల్లో తీసుకొచ్చిన పత్తిని కొనాలని ఈ రైతు అధికారులను బతిమలాడుతున్నాడు. సూపర్‌వైజర్లు శ్రీను, హర్షద్ రైతులందరికీ పత్తి కొనుగోలుకు టోకెన్లు సక్రమంగా అందించేందుకు పర్యవేక్షణ చేస్తున్నారుగాని కొనేందుకు సిద్ధంగా లేరు.


టోకెన్లను చూసుకుంటున్న రైతులు

సోమవారమైనా కొంటారా?

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తుఫాన్ రాయలసీమ వైపు దూసుకు వస్తున్నదని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. గురువారం సాయంత్రానికి ఆకాశమంతా మబ్బులు కమ్మేశాయి. ఏ క్షణమైనా వర్షం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ జిల్లా అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఆధారంగా ఉన్న పెంచికల పాడులోని జిన్నింగ్ మిల్లు వద్ద యంత్రం చెడిపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారు. ఇంకో వైపు వర్షానికి, ఉధృతంగా వీచే గాలులకు కోతకు వచ్చిన పంట పెరికేవేసే అవకాశం లేకుండా పోయిందని, ఏ విధంగా పంటను కాపాడుకోవాలో అర్థం కావడం లేదని రైతులు బోరున విలపిస్తున్నారు.


వేచి ఉన్న రైతులు

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

కర్నూలు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వాదులకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని దామోదరం సంజీవయ్య భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగ నిర్మాత చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించే తీరులో కేంద్ర మంత్రి అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆయన వ్యాఖ్యలతో దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గాల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దిగజారుడు వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు పఠాన్ హబీబ్ ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, నాయకులు చిన్నయ్య, విశ్వేశ్వర్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల రక్షణకు చట్టాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి


మాట్లాడుతున్నలీలా వెంకట శేషాద్రి

పత్తికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖైదీల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి అన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ శివరామచంద్ర రావుతో కలసి ఆయన గురువారం సబ్‌జైల్‌ను పరిశీలించారు. 70 సంవత్సరాలు పైబడి, అనారోగ్య సమస్యలుంటే బెయిల్‌పై ఇంటికి పంపుతామన్నారు. ఖైదీలు తమ సస్యలను న్యాయ సేవాధికార సంస్థకు తెలియచేస్తే సాయం చేస్తారన్నారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గంధం వెంకటయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కపటి నిందితులకు రిమాండ్

- గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్
- పలు చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు

-ఆదోని రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటిలో ఈనెల 14వ తేది శనివారం రాత్రి బీజేపీ నాయకుడు ఈరన్న కుటుంబంపై ఆ పార్టీకి చెందిన వారు మారుణాయుధాలతో దాడి చేసిన ఘటనలో నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. నిందితులపై సెక్షన్ 109 బిఎన్ఎస్ యాక్టు కింద హత్యాయత్నం కేసు నమోదు చేసిన ఇస్వీ పోలీసులు ఈనెల 17వ తేదిన నిందితులు బోయ ఈరమ్మ, వెంకటేశులు, వెంకటస్వామి, గోవిందరాజులు, రవి, తిరుమల, వీరేష్, గిడ్డయ్యలను అరెస్టు చేసి డీన్ జెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించారు. కోర్టు ఈనెల 31వరకు రిమాండ్‌కు ఆదేశించడంతో బుధవారం అర్ధరాత్రి పోలీసులు నిందితులను ఆదోని సబ్ జైలుకు తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ నల్లప్ప, ఎస్.ఐ నాగేంద్ర భారీ బందోబస్తు నిర్వహించడంతోపాటు దాడి జరిగిన ప్రాంతంలో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

కప్పట్రాళ్లకు సీజనల్ హాస్టల్

దేవనకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల గ్రామానికి సీజనల్ హాస్టల్ మంజూరైందని సమగ్ర శిక్ష అధికారి గీత తెలిపారు. గురువారం ఆమె గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల వివరాలు సేకరించి, హాస్టల్ నిర్వహణ పై ఉపాధ్యా యులతో మాట్లాడారు.. గ్రామంలో వలసల నేపథ్యంలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా హాస్టల్లో ఉండి చదువుకోవాలన్నారు. వలసల సమస్యను దత్తపుత్రుడు ఐజీ ఆకే రవికృష్ణ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో, హాస్టల్ ఏర్పాటుకు కృషి చేసిన్నట్లు తెలిపారు. అలెస్కో అధికారి సురేష్‌రాజు, సీఆర్పీ గంగన్న, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం హీనత్ నాయుడు, తదితరులు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారి గీత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఆటోలోనే మృతి చెందిన వీరేష్

ఆదోని రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని నుంచి ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి వెళుతున్న ఆటోను విరూపాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్ర లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వీరేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి చెందిన పుష్పమ్మ, మహానంది దంపతుల కుమారుడు వీరేష్ (35)కు ఏడు సంవత్సరాల క్రితం ఆదోని మండలం హనవాళ్ గ్రామానికి చెందిన రాజేశ్వరితో వివాహమైంది. వీరేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ, భార్యను, తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. పెళ్లయిన ఆరేళ్లకు గర్భవతి అయిన రాజేశ్వరికి బుధవారం రాత్రి చిగిలిలో బంధువర్గ సమక్షంలో సీమంతం చేశారు. గురువారం ఉదయం రాజేశ్వరిని ఆమె తల్లిదండ్రులు హనవాళ్‌కు ప్రసవానికి పిలుచుకొని వెళ్లారు.

ఆ తర్వాత సీమంతానికి వచ్చిన బంధువులను తన ఆటోలో ఆదోనిలో వదిలి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, విరూపాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్ర లారీ వచ్చి వీరేష్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్ ఆటోలోనే మృత్యు వాత పడ్డాడు. వీరేష్ మృతితో అటు చిగిలిలో ఇటు హనవాళ్‌లో విషాదం అలముకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుక ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

గోనెగండ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు ఎల్లెల్సీ దగ్గర వడ్డె అరవిందస్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో అతని ప్రియురాలితో పాటు మరో నలుగురిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. దాడికి పాల్పడిన వారంతా ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్, బీ ఫార్మసీ చదువుకునే విద్యార్థులు కావడం గమనార్హం. నిందితుడు ఈడిగ భరత్ ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నిందితురాలు కూడా అదే కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఎరుకలి రామాంజనేయులు, వడ్ల కుమారస్వామి ఇద్దరు బీ ఫార్మసి చదువుతున్నారు. గంధాల ప్రశాంత్ మాత్రం 10వ తరగతి చదువుతూ నాపరాతి బండల పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం అగ్రహారం దగ్గర ఉన్న మల్లెల వంక వాగులో నిందితురాలైన యువతితో పాటు భరత్, వడ్ల కుమారస్వామి, ప్రశాంత్‌కుమార్, ఎరుకలి రామాంజనేయులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి ఐదు సెల్‌ఫోన్లు, వేట కొడవళ్లు, పల్సర్ మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందుతులు ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. గతంలో కూడా భరత్ గ్యాంగ్ అరవిందస్వామిని హత్య చేసేందుకు వేటకొడవళ్లు, పిడిబాకులతో ఇంటి పరిసరాల్లో తిరిగారు. అయితే అరవిందస్వామి వీరి దొరకకుండా తప్పించుకున్నాడని వివరించారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో ఈ నెల 16వ తేదిన క్షణికావేశంలో బామ్మర్దిని హత్య చేసిన బావను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అర్బన్ సీఐ రాము నిందితుడిని గురువారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన షేక్ అర్షత్ వలి(32), శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన తన మేనత్త కొడుకు షేక్ షఫి గొర్రెలను మేపేవారు. వారం రోజులుగా షేక్ షఫి అతడి తమ్ముడు ముర్తుజాలు, అర్షత్‌వలి, పెద్దతిరుమలయ్య వేరువేరుగా తమ గొర్రెలను మేపుకొనేవారు. ఈ నెల 16వ తేదిన రాత్రి గొర్రెలను వేరువేరు పొలాల్లో ఉంచి కలిసి ఒక చోట చలిమంట వేసుకుని మాట్లాడుకుంటున్నారు. అయితే గొర్రెలను వేరువేరుగా మేపడంపై మద్యం మత్తులో ఉన్న అర్షత్‌అలి, షఫి మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో అర్షత్ అలి చలిమంటలోని ఓ నిప్పు కర్రతో షేక్ షఫిని కొట్టాడు. దీంతో కోపోద్రిక్తుడైన షఫి అక్కడే ఉన్న గొడ్డలితో అర్షత్ తలపై బలంగా దాడి చేశాడు. దీంతో అర్షత్ గట్టిగా కేకలు వేయగా షేక్ షఫి అక్కడి నుంచి పరారయ్యాడు. సమీపంలో ఉన్న గొర్రెల కాపర్లు గాయపడిన అర్షత్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెంది నట్లు వైద్యులు నిర్ధారించారు. అర్షత్ వలి భార్య నసిమూన్ ఫిర్యాదు మేరకు ఈ నెల 17న కేసు నమోదు చేసుకున్న పోలీసులు షేక్ షఫిని బుధవారం సాయంత్రం ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్ వద్ద అరెస్టు చేశారు. గురు వారం షేక్ షఫిని కోర్టులో హాజరు పర్చగా మెసిస్ట్రేట్ రిమాం డ్‌కు ఆదేశించినట్లు సీఐ రాము వెల్లడించారు. ఎస్ఐలు నారాయణరెడ్డి, హుసేన్‌బాషా, ఏఎస్ఐ శంకరరెడ్డి, సంజీవుడు, కానిస్టేబుళ్లు లక్ష్మణరావు, మౌలాలి, మదర్ సాహెబ్, రవి, శివరామ్, రాజశేఖర్, స్వర్ణ ఉన్నారు.

కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు

- ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసయ్య

కర్నూలు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య ఆరోపించారు. గురువారం కర్నూలు,నంద్యాల జిల్లాలకు సంబంధించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు ఏవీ రెడ్డి, ఆర్‌ఎస్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతపై 2019లో టీడీపీ ప్రభుత్వం హయంలో ఇచ్చిన సర్క్యులర్ నెం-01 అమలు చేయాలని రవాణామంత్రిని కోరడం జరిగిందన్నారు. వెంటనే ఆయన స్పందించి కేంద్ర కార్యలయంలో ఈడీ స్థాయి అధికారులకు ఆ సర్క్యులర్‌ను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా కొంతమంది కింది స్థాయి అధికారులు మాత్రం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉద్యోగులపై చార్జీషీట్లు, సస్పెండ్లకు పాల్పడుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగులకు ఆర్‌ఈఎంఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈయూ వినతి మేరకు నైట్‌అవుట్ అలవెన్స్‌లు ఇచ్చేలా కృషి చేసిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీలో ఉన్న అన్ని కేటగిరిలో ఖాళీలను భర్తీచేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.మద్దిలేటి మాట్లాడుతూ ఈహెచ్‌యస్‌తో అసలు వైద్యసౌకర్యాలు అందడంలేదన్నారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, రిటైర్డ్ పొందిన ఉద్యోగులకు విలీనం ముందున్న పద్ధతుల్లోనే రెఫరల్ ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కడప జోన్, కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు కె.కె.కుమార్, దేవసహాయం, రాముడు, ముత్యాలరెడ్డి, బాషా, వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని బంగారానికి రుణం

- ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఆడిట్‌లో బట్టబయలు
- మోసగించిన సిబ్బంది, కస్టమర్లపై కేసు

ఎమ్మిగనూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్‌లో బంగారాన్ని కుదువ పెట్టి రూ.29 లక్షలు రుణం తీసుకున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఆ సంస్థకు చెందిన నలుగురు సిబ్బందిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గౌస్, ఖాద్రి, ముస్తాఫ్ వివిధ సమాయాల్లో ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారాన్ని కుదవ పెట్టి రూ.29 లక్షలు రుణం తీసుకున్నారు. అయితే ఈ బంగారం తక్కువ నాణ్యతగా ఉన్నట్లు ఆడిట్‌లో గుర్తించారు. బంగారానికి ఇవ్వాల్సిన శాతం కంటే ఎక్కువ మొత్తం రుణం మంజూరైనట్లు గుర్తించారు. దీంతో ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఆర్ఎం వశీకరప్ప ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఎమ్మిగనూరు శాఖ మేనేజర్ జయరాం, సిబ్బంది రాముడు, ఉరుకుందుతో పాటు ముగ్గురు కస్టమర్లపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25న రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

ఓర్వకల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో ఈనెల 25న ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను సందర్భంగా తెలుగు రాష్ట్రాల పాలపండ్ల ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వందనాలు గురువారం తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరవుతార న్నారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.35వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 94941 412127, 9949140245 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తబస్టాండు సుందరయ్య కూడలిలో నిరసన తెలిపి అమిత్‌షా ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ రాజ్యాంగానికి సంబంధించిన చర్చ జరుగుతున్న క్రమంలో అంబేడ్కర్ పేరును స్మరించే బదులు దేవుని పేరు స్మరిస్తే ఏడుసార్లు స్వర్గానికి వెళ్లిరావచ్చని అమిత్‌షా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్ కుమార్ ఆచారి

కర్నూలు అర్బన్: కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని డిమాండ్ చేశారు. గురువారం అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ అవమానించిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ అనే దాని కంటే రామ రామ అంటే పుణ్యం వస్తుందని అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న, అనంతరత్నం మాదిగ, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్ర క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భరత్ కుమార్ ఆచారి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మద్దూరునగర్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ గురించి అవమానకరంగా అమిత్‌షా మాట్లాడడం విచారకరమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు శేఖర్ నాయుడు, కార్యదర్శి మద్దిలేటి , సుంకన్న, రాజు పాల్గొన్నారు.

● అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఎప్పటికీ కూడా ఈ దేశంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తారని అన్నారు. దేశంలో 3వేల సంవత్సరాల నుంచి ఏదో ఒక రూపంలో మనువాద, బ్రాహ్మణ భావజాలమే రాజ్యమేలుతుందని అమిత్‌షా పార్లమెంటు సభలో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించారన్నారు.



సుందరయ్య కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరులో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ గురువారం ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీలార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నన్నూరు గ్రామంలో పేదలకు ఇంటి స్థలాల కోసం పట్టాలు ఇచ్చారని అయితే.. ప్లాట్ నెంబర్లు వేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్లకు నెంబర్లు వేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నూర్‌బాషా, విక్రమ్, చాంద్ బాషా, జమాల్, శ్రీనివాసులు, షాలుమియా పాల్గొన్నారు.

విధుల్లోకి ఇంజనీరింగ్ కార్మికులు

తాత్కాలికంగా సమ్మె వాయిదా

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు విధులకు హాజరయ్యారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా గత 10 రోజులుగా సమ్మె కొనసాగించారు. ఈ మేరకు కార్మికుల సమస్యలపై సీడీఎంఏ కార్యాలయంలో అన్ని యూనియన్ల నాయకులతో చర్చలు జరిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి డిమాండ్లను మున్సిపల్ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి మరోసారి సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరవుతామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జే.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనో హర్, నగర అధ్యక్షుడు జి.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జావీద్, కాశపోగు జ్ఞానమ్మ పాల్గొన్నారు.

22న కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో ఈ నెల 22న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు జరుగుతాయని ప్రధాన కార్యదర్శి సుదాకర్, సురేష్‌లు తెలిపారు. ఈ పోటీల్లో బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలు ఉండాలన్నారు. జిల్లాస్థాయి కబడ్డీ ఎంపీక పోటీలకు వచ్చేవారు 1.1.2006 తర్వాత జన్మించిన వారై ఉండా లన్నారు. ఆధార్‌కార్డు, పదో తరగతి మార్క్స్ మెమో జిరాక్స్ వెంట తెచ్చుకోవాలన్నారు.

22న క్రాస్ కంట్రీ సెలెక్షన్: ఉమ్మడి జిల్లాల అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న సిల్వర్‌జూబ్లీ క్రీడా మైదానంలో బాలబాలికలకు క్రాస్ కంట్రా సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సుబ్బరత్నాలు తెలిపారు. ఎంపికైన అథ్లెట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొనవలెనని కార్యదర్శి తెలిపారు. వివరాలకు 8919409232, 9493323964 నెంబర్లను సంప్ర దించాలని సూచించారు.

● **22, 23 తేదీల్లో పవర్‌లిఫ్టింగ్ పోటీలు:** విజయవాడలోని కృష్ణలంక జూనియర్ కాలేజీలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు డీఎస్ఏ స్టేడియంలోని ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో ధృవపత్రాలు సమ ర్పించి రిపోర్టు చేసుకోవాలని వారు తెలిపారు.

శిక్షణా తరగతులు

విద్యార్థుల అభ్యాసనకు తోడ్పడుతాయి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శిక్షణా తరగతులు విద్యార్థుల అభ్యాసనకు తోడ్పడుతాయని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకుడు జి.అపర్ణ అన్నారు. గురువారం స్థానిక లక్ష్మి శ్రీనివాస కాలేజీ ఆఫ్ ఎడ్యు కేషన్‌లో జరిగే ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒకరి అనుభవాలు ఒకరు పంచుకోవడానికి శిక్షణా కార్యక్రమాలు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్లు రమేష్, దావీదు, సీఆర్‌పీలు, డీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాథోలిలో ఇంటింటికీ కొళాయి



కొళాయి నీటిని వదులుతున్న సర్పంచ్

సి.బెళగల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్యాథోలి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ రామంజినేయులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, సీనియర్ టీడీపీ నాయకుడు విషువర్ధన్‌రెడ్డి బ్యాథోలి గ్రామంలో ఇంటింటికీ కొళాయిలు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం బ్యాథోలిలో ఇంటిం టికీ కొళాయిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్, తిమప్ప, రామమోహన్‌రెడ్డి, తిప్పన, వెంకటరాముడు, వెంకటప్ప పాల్గొన్నారు.

ప్రతి వారం గ్రామాలను సందర్శించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే వారం నుంచి స్పెషల్ ఆఫీసర్లంతా ప్రతి వారం వారికి కేటాయించిన మండలంలో ఓ గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వసతి గృహం, సచివాలయం, పీహెచ్‌సీలను సందర్శించి నిర్దేశించిన ప్రొఫార్మాలో తనిఖీ నివేదికలను పంపాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ భవనంలో వంద రోజుల లక్ష్యాల పురోగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జనవరి 2025 నుంచి మార్చి వరకు రూపొందించనున్న మూడో వంద రోజుల ప్రణాళికలో కేవలం మంజూరు, గ్రౌండింగ్‌పైనే కాకుండా పనులు పూర్తి చేసే విదంగా లక్ష్యాలను నిర్ధేశించుకోవాలన్నారు. జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన కార్యాచరణ ప్రణా ళికను రూపొందించి సమర్పించాలని జడ్పీ సీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలను ఆదేశించారు. సివిల్ సప్లయిస్‌కి సంబంధించి ఎఫ్‌పీ షాపులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతుందని డీఎస్‌వోను ప్రశ్నించారు. పంచాయతీరాజ్ సీసీ రోడ్లకు సంబంధించి 830 పనులకు గానూ 581 పూర్తయ్యాయని, మిగిలిన పనులకు సంక్రాం తిలోపు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ (సంస్థాగత తోటల పెంపకం) పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, గూడూరు, ఆదోని మున్సిపాలిటీలకు సంబంధించి మున్సిపాలిటీ లేద లోకల్ ఫండ్స్ ద్వారా మున్సిపల్ రోడ్లు ప్యాచ్‌వర్కు పనులు చేయించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కోర్టు కేసులు స్టేజ్ వారీగా అప్‌డేట్‌గా ఉండాలని, కేసులకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అన్నారు. సమావేశంలో డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

వర్క్‌షాపును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) వర్క్‌షాపును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 8వ తేదీ నుంచి 10 వరకు విజయవాడలో జరిగే వర్క్‌షాపుకు కార్మికులు తరలిరావాలన్నారు. వివిధ రాష్ట్రాల్లోని ట్రాన్స్‌పోర్టు రంగానికి సంబంధించిన నాయకులు ఈ వర్క్‌షాపులో పాల్గొంటారన్నారు. ఈసమా వేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య పాల్గొన్నారు.

కమ్యూనిజం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రూపొందించిన కమ్యూనిజం ప్రత్యేక సంచికను సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తదితరులు ఆవిష్కరించారు. గురువారం సీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు గడస్తుందన్నారు. సీపీఐ సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలు, చేసిన త్యాగాలను స్మరిం చుకోవడానికి కమ్యూనిజం ప్రత్యేక సంచికను రూపొందించా మన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, అమినాబి, శ్రీనివాసులు, చంటి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని అనుగొండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సద స్సులు నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సాలురెడ్డి, ఆర్ఎస్‌డీటీ క్రిష్ణమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని మల్లాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో 7 అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రా రెడ్డి, వీఆర్‌వో ఖాజా బందేనవాజ్, రైతులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. గురువారం మండలంలోని కేతవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఆలయ ఈవో మద్దిలేటి, వీఆర్వోలు మద్దిలేటి, సోమన్న, నాగరాజు, సర్పంచ్ గోవర్దన్ పాల్గొన్నారు.



అనుగొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్



మల్లాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు



పురుగుల మందులను పరిశీలిస్తున్న ఏవో

సి.బెళగల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగుల మందులను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కంబంధహాల్, పోలకల్లు, ముడుమాల గ్రామాలలోని పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పురుగుల మందుల దుకాణాల్లోని మందులను పరిశీలించి అమరావతి ల్యాబ్‌కు పంపుతు తామన్నారు. ఏవో వెంట ఎంపీవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్ ఉన్నారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా నెట్‌బాల్ సంఘం ఈనెల 9న నిర్వహించిన సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలబాలికల జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ ఎంపిక పోటీల్లో ఆర్.కొంతలపాడు పాఠశాల బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన కార్యక్ర మానికి ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి పాల్గొని విజేతలను అభినందిం చారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీ.. ఇద్దరికి గాయాలు

సి.బెళగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో పోలకల్లు గ్రామానికి చెందిన సుదాకర్, ఏసేపులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి: సీపీఎం

ఓర్వకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నన్నూరు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నన్నూరు గ్రామంలో ఇటీవల జాతీయ రహదారిపై వేసిన మెట్ల వంతెన నిరుపయోగంగా మారిందన్నారు. అయితే.. విద్యార్థులు వాటిపై మెట్లను ఎక్కలేక రహదారులను దాటి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారన్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈవిషయంపై అనేక సార్లు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, మధుసూదన్ పాల్గొన్నారు.

రేపు చిన్నారులతో భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌భాగ్‌లోని గీతా ప్రచార ధామంలో శనివారం ఉదయం 9.30 గంటలకు 155 మంది చిన్నారులతో, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సహకారంతో సామూహిక భగవద్గీత పారాయణం ఏర్పాటు చేసినట్లు వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం అధ్యక్షురాలు బెస్త నాగమల్లేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీతలోని ఒకటోవ అధ్యాయం అర్జున విశాదయోగంలోని 1 నుంచి 47 శ్లోకాలు చిన్నారులు సామూహి కంగా పారాయణం చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి సనా తన ధర్మ పరిరక్షకులు, ధార్మికవేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని బాలురు, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. విధుల్లో ఉన్న ఉద్యోగులతోపాటు విద్యార్థులు కూడా బాధ్యతతో మెలగాలన్నారు.



ఏఆర్ కానిస్టేబుల్ దాతృత్వం

స్టేడియానికి ఇసుక వితరణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇండోర్ స్టేడియంలో ప్రతి రోజు వందల మంది ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు వాకింగ్, జాకింగ్‌తోపాటు ఇతరత్రా వ్యాయామాలు చేస్తుంటారు. ఏఈఆర్ కానిస్టేబుల్ వేణు తన సొంత నిధులతో లాంగ్‌జంప్ గుంతలో ఓ ట్రాక్టర్ ఇసుకను తన సొంత ఖర్చులతో వేయించారు. యువకులు పోలీసు, ఎస్ఐ ఉద్యోగాల కోసం కూడా సాధన చేస్తుంటారు. ఇలా ప్రతి ఒక్కరూ స్టేడియంలో ఉదయం, సాయంత్ర వేళల్లో ఇక్కడి వస్తుంటారు. ఈ నేపథ్యంలో స్టేడియంలో లాంగ్‌జంప్ కోసం ప్రత్యేకంగా ఓ గుంత ఏర్పాటు చేసి అందులో ఇసుకను ఎప్పుడో నింపారు. సంవత్సరం కిందట నింపిన ఇసుక బయటికి వెళ్లి పోవడంతో గుంతలో ఇసుక తక్కువైంది. రెండు రోజుల క్రితం ఇద్దరు యువకులు లాంగ్‌జంప్ ప్రాక్టీసు చేస్తూ కిందపడి గాయాలయ్యాయి. దానిని చూసి చలించిన ఏఆర్ కానిస్టేబుల్ వేణు లాంగ్‌జంప్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో ఇసుకను వేయించేందుకు తన సొంత నిధులు ఖర్చులతో ఓ ట్రాక్టర్ ఇసుకను అందులో పోయించారు. ప్రస్తుతం వేణు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహి స్తున్నారు. కానిస్టేబుల్ దాతృత్వంతో లాంగ్ జంప్ చేసిన మరెవ్వరికి కాళ్లు విరగకుండ చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసి స్తున్నారు.



స్టేడియంలో ఇసుకను వేయిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ వేణు

సమస్యలపై అర్జీల స్వీకరణ



మాట్లాడుతున్న ఎంపీడీవో

కోడుమూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుడ్ గవర్నన్స్ వర్క్‌లో భాగంగా ప్రజా సమస్యలకు మెరుగైన సేవలు అందించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24 వరకు ప్రజలు తమ సమస్యలపై అర్జీ ఇచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక శిబిరంలో ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి

సి.బెళగల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలని ఈవోఆర్డీ ఈశ్వరస్వామి అన్నారు. గురువారం గొల్లలదొడ్డి గ్రామంలో నిర్మించిన చెత్తసేకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ రామలింగమ్మ ఉన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈవోఆర్డీ

కేంద్ర హోం మంత్రిని బర్తరఫ్ చేయాలి

ఆలూరు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని మాల మహానాడు జిల్లా కార్యదర్శి హత్తి బెళగల్ ఈరన్న గురువారం డిమాండ్ చేవారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ రచయిత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా ఉన్నాయన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానపరిచినట్టుగా భావిస్తున్నామన్నారు. అమిత్‌షా తక్షణం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ కోరాలని లేనిపక్షంలో ఆందళన చేస్తామని హెచ్చరించారు.

వర్మీకంపోస్టును తయారు చేయండి



చెత్తసంపద కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎల్పీవో లక్ష్మి

వెల్దుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువును తయారుచేయాలని డివిజన్ లెవెల్ పంచాయతీ అధికారి లక్ష్మి ఆదేశించారు. గురువారం రామళ్లకోట, నరసాపురం, నార్లాపురం గ్రామాల్లో చెత్తసంపద తయారీ కేంద్రాలను డీఆర్పీసీ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ మంజులవాణితో కలిసి పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను నిరుపయోగంగా ఉంచరాదన్నారు. తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు, సర్పంచులకు సూచించారు. ఈవోఆర్డీ రవికిశోర్, కార్యదర్శులు రహమత్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం మంచిది కాదు

ఆదోని టౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అభివృద్ధి పనులను వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకోవడం సమంజసం కాదని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ సూచించారు. కుర్చీల కోసం రాద్ధాంతాలు చేస్తున్నారని, సమావేశాలు జరగకుండా చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే పార్థసారథికి కౌన్సిలర్లంతా సహకరించి, అభివృద్ధి జరిగేలా చూడాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మృతదేహం

మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులోని శేషిరెడ్డి బావి వెనుక గుర్తు తెలియని ఓ వృద్ధుడి శవాన్ని గురువారం కనుగొన్నారు. గుంతకల్లు నుంచి డోన్ వెళ్లే రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియ రాలేదు. మృతదేహంపై తెల్లగీతల చొక్కా, నల్లప్యాంటు ఉందని, 60ఏళ్ల వయస్సు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు



సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

● తహసీల్దార్ కారు అడ్డగింపు

దేవనకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. పాలకుర్తి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు సరైన సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు. దీంతో అగ్రహానికి గురైన పాలకుర్తి, తెర్నేకల్ గ్రామాల రైతులు, సీపీఎం నాయకులు తహసీల్దార్ కారు వెళ్లకుండా బైఠాయించారు. గతంలో తెర్నేకల్, పాలకుర్తిలో రీసర్వేతో భూముల వివరాలు సక్రమంగా లేవని విన్నవించాన పరిష్కరించలేదని రైతులు నిరసన తెలిపారు. స్పందించిన తహసీల్దార్ లోకేశ్వరయ్య భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతుల శాంతించారు. సీపీఎం నాయకులు వీరశేఖర్, మహబుబ్‌బాషా, శ్రీనివాసులు ఉన్నారు.

రీసర్వే పేరుతో అన్యాయం చేశారు

మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రీసర్వే పేరుతో తమకు తీవ్ర అన్యాయం చేశారని రైతులు వాపోయారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ బురుజుల విజయుడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుసేన్ సాహెబ్ పాల్గొన్నారు. ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన రైతుల తమ భూములు బురుజుల గ్రామ పరిధిలో ఉన్నాయని, రీ సర్వేతో తక్కువ విస్తీర్ణం చూపుతోందన్నారు. స్పందించిన అధికారులు అర్జీలను పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీఆర్వోలు స్వర్ణలత, రంగస్వామి, రషీదు, దేవాలయ అధికారి రఘు, టీడీపీ వైసీపీ నాయకులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

అలంకార ప్రాయం

● నిరుపయోగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని దుకాణాలు

● వేలాల నిర్వహణకు రాజకీయ గ్రహణం



అలంకార ప్రాయంగా మారిన మండల పరిషత్తు షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.80 లక్షలతో 2021లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ అలంకార ప్రాయంగా మారింది. ఇందులో 18 దుకాణాలు ఉన్నాయి. ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా అనివార్య కారణాలవల్ల వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్య నారాయణ ప్రకటించారు.

రాజకీయ అడ్డంకులు

గత వైసీపీ హయాంలో తమ వారికే దుకాణాలు ఇవ్వాలని నాయకులు ఒత్తిడి తేవడంతో నాడు షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించలేదు. నాటి మంత్రి గుమ్మనూరు జయరాం గత ఏడాది జూలై 27న కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అయితే ఇంత వరకు దుకాణాలకు వేలం వేసి అద్దెకు ఇవ్వలేదు.

రాజకీయ ఒత్తిడికి లొంగవద్దు

అధికారులు రాజకీయ ఒత్తిడికి లొంగకుండా వేలాలు నిర్వహించాలి. దుకాణాలులేక వ్యాపారులు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. **- మైనా, డీవైఎఫ్ఐ**

తాత్కాలికంగా వాయిదా వేశాం



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన దుకాణాల వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేశాం. త్వరలోనే బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తాం. **- సూర్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఆలూరు**

రేపు హైందవ శంఖారావం

ఆదోని టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న పట్టణంలోని రెడ్డి కళ్యాణమండపంలో హైందవ శంఖా రావం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ అధ్యక్షు డు బసవన్న గౌడ్ తెలిపారు. గురువారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్య అతిథిగా విహెచ్‌పీ దక్షిణ ఆంధ్ర ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర బాబు, ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొంటార న్నారు. సాయంత్రం సభ ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. విద్యుత్ మెయిన్ లైన్ల పనుల నమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!

● ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయని అధికారులు

● హొళగుందలో ఇబ్బందులు పడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు



ఆధార్ నమోదు కేంద్ర కోసం ఎదురు చూస్తున్న చిన్నారులు

హొళగుంద, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. 0 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారుల కోసం ఈనెల 17వతేదీ నుంచి ఈ నెల 20వరకు ఆధార్ నమోదు చేయాలి. అయితే హొళగుందలో మాత్రం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు కాలేదు. ఇక్కడ ఆధార్ నమోదును సచివాలయం-3లో నిర్వహిస్తున్నారు. పిల్లలను అక్కడికి రెండు కిలో మీటర్ల దూరంలోని సచివాలయానికి తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉందని చిన్నారుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో విజయ లలితను వివరణ కోరగా సచివాలయం సిబ్బంది సెలవుపై వెళ్లారని ఈ రోజు మధ్యాహ్నం నుంచి అంగన్వాడీ కేంద్రాలలో ఆధార్ కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ గౌడ్

హాలహర్వి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంతోనే గూళ్యం పంచాయతీ అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ గౌడ్ అన్నారు. గురువార విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ నిధులు తీసుకొచ్చి సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయించారన్నారు. కాశప్ప, మాబాషా, లక్ష్మీ కాంత పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



సీసీ రోడ్డు వేయడానికి గుంతల పూడ్చివేత..

మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవిరెడ్డి వీధి పక్కన ఉన్న మద్దమ్మ బొడ్రాయి నుంచి చింతమాను చెట్టు వరకు రోడ్డు పెంట దిబ్బగా మారింది. అయితే సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు నిధులు మంజూరయ్యాయి. 50 ఏళ్లుగా ఇలా ఉండటంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. గురువారం పనులు ప్రారంభమవ్వడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్, పంచాయతీ సభ్యుడు కవిరెడ్డి కృష్ణ మాట్లాడుతూ మండల నిధులతో రోడ్డు వేస్తున్నామన్నారు. కాలనీవాసులు టైలర్ గోపాల్, నాగయ్య, శ్రీనివాసులు, రాయుడు, సంతోష్ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కందులను కొనుగోలు చేసేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో వెంకట్రాముడు సూచించారు. గురువారం మాట్లాడుతూ ఖరీఫ్ కింద మండలంలో కంది సాగు చేశారన్నారు. ఈక్రాప్ నమోదు చేశామని, వివరాలకు రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

సీపీఐ మాజీ నాయకుడి మృతి

పత్తికొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహుల్తి గ్రామ సీపీఐ మాజీ నాయకుడు ఉప్పరి గోవిందప్ప (65) గురువారం మృతి చెందాడు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి నబీరసూల్ నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామార్శించారు. నాయకులు కారన్న, వెంకట్రామిరెడ్డి, నక్కల ఉల్తన్న, ఉచ్చన్న, నరసప్ప, మాదన్న, మాజీ నాయకులు కారుమంచప్ప, హుల్తన్న, ప్రజానాట్య మండలి నాయకులు వర్మ, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

అవార్డుపై హర్షం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం పట్ల అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద హర్షం వ్యక్తం చేశారు. గురువారం ముఖ్యనాయకులు సమావేశం నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ తెలుగు రాష్ట్రాలల్లో అభ్యుదయ సాహిత్య విస్తృతికి, అరసం నిర్మాణానికి పటిష్టమైన పునాదులు వేశారన్నారు.

భూసమస్యలు పరిష్కారం

పత్తికొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ రమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని రెండో సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూసమస్యలపై అర్జీలు సమర్పించారు. ఆర్ఐ నాగరాజు, మండల సర్వేయర్ గాదెలింగప్ప, వీఆర్వో సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాగుపడుతున్న రహదారులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక గుంతలు పూడ్చి నూతన రహదారులు వేస్తున్నారు. పత్తికొండ-ఆదోని రహదారిలో మరమ్మతులు చేసిగుంతలు పూడ్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గుంతలను పూడ్చాలని ఆదేశించిందని తెలిపారు.

గుంతల పూడ్చివేత

తుగ్గలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుగ్గలి, పెరవలి గ్రామాల మధ్య రహదారిపై ఉన్న గుంతలను కాంట్రాక్టర్ సంజీవ చౌదరి ఆధ్వర్యంలో కంకర, తారుతో వేశారు. అలాగే రూ.6 లక్షలతో జొన్నగిరి, జి.ఎర్రగుడి, రాతన తదితర గ్రామాల ఆర్‌అండ్‌బీ రహదారుల్లోని గుంతలను కూడా పూడ్చామన్నారు.

దుర్గమ్మ పూజలు

మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని కవిరెడ్డి వీధిలో భవానీమాలధారులు విజయవాడ దుర్గమ్మ పూజలు వైభవంగా చేశారు. గురువారం మాలధారులు భవానీ శ్రీనివాసులు, భాస్కర్ మెట్ల పూజతో అందంగా అలంకరించి అమ్మవారిని ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. మెట్లు కూడా పెట్టి దుర్గమ్మకు పూజలు చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆలూరు రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కరించాలని బమ్ముదనగేరి సర్పంచ్ సుధాకర్ రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విరుపాపురం జలాశయం నుంచి తాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు. తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, వ్యవసాయ బోర్లకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని చెప్పారు.

చుక్కల భూములను సరి చేయండి



పగిడిరాయిలో సమస్యలు వివరిస్తున్న రైతులు

తుగ్గలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూములను కూడా చుక్కలు భూములుగా నమోదు చేశారని, సరి చేయాలని రైతులు అధికారులను కోరారు. గురువారం మండలంలోని పగిడిరాయిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రత్యేకాధికారి సుధాకర్, తహసీల్దార్ రమాదేవి వినతులు స్వీకరించారు. ఈవో వీరయ్య, వీఆర్వో నయోమి, ఫారెస్టు ఆఫీసర్ లక్ష్మన్న ఉన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



కామినహల్‌లో ఆర్డీవోతో మాట్లాడుతున్న రైతులు

హాలహర్వి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): కామినహాల్ చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గురువారం రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆర్డీవో భరత్ నాయక్‌తో మాట్లాడారు. సర్వే చేయించి, హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని కోరారు.

స్పెషల్ క్యాంప్‌నకు స్పందన కరువు

● ఫిర్యాదు చేయడానికి రాని ప్రజలు



ఖాళీగా ఉన్న అధికారులు

తుగ్గలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రశాసన్ గావో కీ వోర్ స్పెషల్ క్యాంప్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ క్యాంపును ఈవోఆర్డీ శ్రీహరి ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు ఉన్నా ప్రజలు రాలేదు. గ్రామంలోని స్థానిక సమస్యలు, తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సమస్యలపై ప్రజలు వినతులు ఇస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పారథసారథి

ఆదోని రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. గురువారం కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నీటిని పొదుపుగా వాడాలని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా తుంగభద్ర దిగువ కాల్వ నుంచి ప్రవహిస్తున్న నీటిని బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల చెరువుకు పూర్తి స్థాయిలో నింపడానికి కృషి చేస్తామన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రామల అబివృద్ధి టీడీపీతోనే అని ఆ పార్టీ నాయకులు కొనకొండ్ల నాగరాజు, బోయ చంద్ర, శేఖన్న అన్నారు. గురువారం రూ.5 లక్షలతో చేయనున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. సీఎం చంద్ర బాబు నాయకత్వంలో గ్రామాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. శేఖర్, వీరేష్, నాగరాజు, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ సతీష్

హొళగుంద, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సతీష్, అన్నారు. గురువారం సులువాయి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 11అర్జీలు వచ్చాయని వీటిని పరిష్కరిస్తామన్నారు. ఎండోమెంట్ అధికారి సురేంద్ర వీఆర్వోలు నాగరాజు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● మద్దికెర పశువైద్యాధికారి కృష్ణ నాయక్



మద్దికెర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలానికి ఎన్ని గోకులాలు మంజూరయ్యాయి?

జవాబు: మండలంలోని 11 గ్రామాలకుగాను 33 గోకులాలు మంజూరయ్యాయి. వీటి పనులను కూడా ప్రారంభించాం.

ప్రశ్న: పశుగ్రాస క్షేత్రాలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారా?

జవాబు: విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. పశుగ్రాస క్షేత్రాలు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు ఉంటే ప్రోత్సాహకాలు ఇస్తున్నాము.

ప్రశ్న: ఆడ దూడల పెంపకానికి ప్రోత్సాహం ఉందా?

జవాబు: ఎస్ఎస్ఎస్ఎంలో భాగంగా ఆడదూడలు పుట్టేందుకు వ్యాక్సిన్‌ను అందజేస్తున్నాము. ఇప్పటి వరకు దాదాపు 30 వ్యాక్సిన్లు ఇచ్చాము.

ప్రశ్న: పశుగ్రాస పెంపకానికి నిధులు మంజూరయ్యాయా?

జవాబు: తోటల్లో పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం వందశాతం రాయితీ ఇస్తుంది. ఆసక్తిగల రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, 1బీ, బ్యాంకు బుక్, ఆధార్ జిరాక్స్ తో కార్యాలయంలో సంప్రదించాలి.

ప్రశ్న: పశుగణన ఎంత వరకు వచ్చింది..?

జవాబు: ఇప్పటి వరకు మండలంలో 2వేలకు పైగా పశుగణన పూర్తయిందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నాటికి పశుగణన పూర్తి చేస్తామని తెలిపారు.

కలగా మోడ్రన్ మార్కెట్..!

● 2019లో ఏర్పాటుకు చర్యలు
● ఇరుకు స్థలంలో వ్యాపారుల అవస్థలు
● మార్కెట్‌లో వేధిస్తున్న సమస్యలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): చేనేతపురిగా పేరొందిన ఎమ్మిగనూరు వ్యాపారపరంగా ప్రసిద్ధి గాంచింది. ఎమ్మిగనూరుకు పట్టణవాసులతోపాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు మండలం, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం నియోజకవర్గంలోని మంత్రాలయం, పెద్దకడుబూరు, పత్తికొండ నియోజకవర్గంతోపాటు కోడుమూరు నియోజకవర్గంలోని సి. బెళగల్ మండలం నుంచి ప్రజలు అధికంగా వస్తుంటారు. అప్పటి మంత్రి బీవీ మోహన్‌రెడ్డి నందమూరి తారకరామారావు కూరగాయల మార్కెట్‌గా నామకరణం చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో మార్కెట్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మున్సిపాలిటీకి ఏడాదికి రూ.25 నుంచి 30లక్షల ఆదాయం వస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కూరగాయల మార్కెట్‌ను మోడ్రన్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చి శంకుస్థాపన చేసినా నేటికీ కలగానే మిగిలింది. మార్కెట్ అసౌకర్యాలకు నిలయంగా మారడంతో చిరువ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. షెడ్లు లేకపోవడంతో వ్యాపారులు ఎండలో ఎండుతూ.. వర్షంలో తడుస్తూ విక్రయాలు జరుపుతుండగా.. వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు.

● మార్కెట్‌లో 500 మందికి పైగా వ్యాపారులు

తారకరామ కూరగాయల మార్కెట్‌లో దాదాపు 500 మందికి పైగా వ్యాపారులు కూరగాయలు, మాంసం, కుండలు, వెల్డింగ్ మిషన్లు, కారం, టీ స్టాల్, బీడీ బంకులు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. అలాగే మార్కెట్ పరిధిలో గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కరోనా సమయం వరకు హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ సైతం ఇక్కడే సాగేది. కరోనా తరువాత హోల్‌సేల్ మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. అలాగే వీవర్స్ కాలనీ గ్రౌండ్, పశువుల మార్కెట్ దగ్గర సైతం కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో మున్సిపాలిటీకి గతంలో కన్నా మార్కెట్ నుంచి అధికంగా సమకూరుతోంది. రోజు లక్షల్లో వ్యాపారాలు జరుగుతున్నాయి. ఈ నిధులతో కూరగాయల మార్కెట్‌ను అపురూపంగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా అటు పాలకులు కాని, అధికారులు కాని పట్టించుకోవడం లేదు.

● అస్తవ్యస్తంగా మార్కెట్

కూరగాయల మార్కెట్ అస్తవ్యస్తంగా మారింది. దాదాపు ఐదు ఎకరాల్లో విస్తరించి ఉన్న మార్కెట్‌లో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. కూరగాయల వ్యాపారులు కూర్చునేందుకు షెడ్లు వంటివి నిర్మించాల్సి ఉంది. షెడ్లు లేకపోవడంతో వ్యాపారులు రహదారులపైనే కూర్చొని విక్రయాలు జరుపుతున్నారు. కొంతమంది రహదారి మధ్యలో, మార్కెట్ ప్రవేశ ద్వారం దగ్గర దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. కూరగాయలు, ఆకుకూరలు వాన, ఎండలో అమ్ముతుండడంతో అవి కుళ్లి వ్యాపారులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. అంతేగాక మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిగిన తరువాత మిగిలి పోయిన వ్యర్థాలను అక్కడే వేస్తుండటంతో అవి కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక మార్కెట్ ఆవరణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టకపోవటంతో వర్షం నీరు నిలిచి కంపుకొడుతోంది. వినియోగదారులకు మంచినీటి వంటి సౌకార్యాలు లేకపోగా ముక్కుమూసుకొని కూరగాయలు కొనాల్సిన పరిస్థితి వస్తోంది.

● 2019లో మోడ్రన్ మార్కెట్‌కు భూమిపూజ

పట్టణ నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్‌ను మోడ్రన్ మార్కెట్‌గా తీర్చి దిద్దేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు రూ.1.50 కోట్లు మంజూరు చేసి అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పనులకు భూమి పూజ చేశారు. రూ. 2 కోట్లతో టెండర్లు పిలిచారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారటం, వైసీపీ అధికారంలోకి రావటంతో మోడ్రన్ మార్కెట్ కలగానే మిగిలింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మార్కెట్ ఆధునికీరణకు పైసా కూడా కేటాయించలేదు. దీంతో వ్యాపారులు సమస్యలతో సావాసం చేస్తు వ్యాపారాలు సాగిస్తున్నారు. నిధులు కేటాయించి మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.


ఎమ్మిగనూరులోని తారకరామ కూరగాయల మార్కెట్



స్థల ప్రభావంతో మార్కెట్ మధ్యలో పెట్టుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం, మార్కెట్‌లో చెత్తాచెదారం

40 ఏళ్లుగా ఇలాగే కొనసాగుతున్నాం


40 ఏళ్లుగా ఎండకు ఎండుతూ, వానకు నానుతూ వ్యాపారాలు చేసుకుంటున్నాం. వర్షానికి తడిస్తే సరుకు కుళ్లిపోయి నష్టం వస్తుంది. అదే దుకాణాలు (రూములు) కట్టిస్తే బాగుంటుంది.

- అక్కన్న, వ్యాపారి, ఎమ్మిగనూరు

మార్కెట్ బాగుండాలంటే దుకాణాలు నిర్మించాలి


కూరగాయల మార్కెట్‌లో దుకాణాలు కట్టించి ఎవరివి వారికి ఇస్తే బాగుంటుంది. మార్కెట్ అంత క్లీన్‌గా ఉంటుంది. వచ్చే జనానానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. దుకాణాలు నిర్మిస్తే ఎక్కడ ఎక్కువ డిపాజిట్ చెల్లించాల్సి వస్తోందని మా వ్యాపారులు భయపడుతున్నారు.

- రాములమ్మ, వ్యాపారి, ఎమ్మిగనూరు

పీపీపీ పద్ధతితో ఆధునికీకరణకు ప్రతిపాదనలు


తారకరామ కూరగాయల మార్కెట్ ఆధునికీకరణకు గతంలో ప్రతిపాదనలు రద్దయ్యాయి. ప్రస్తుతం పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో 250 దుకాణాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

రాఘవేంద్రుని సన్నిధిలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి


మంత్రాలయంలో లీలా వెంకట శేషాద్రి

మంత్రాలయం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.లీలా వెంకట శేషాద్రిగురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఆయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట అనంతపురాణిక్ అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, నరసింహ దేశాయ్ పాల్గొన్నారు.

సీపీఎం మండల కన్వీనర్‌గా రాముడు

కోసిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కోసిగి మండల కన్వీనర్‌గా రాముడును ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పీఎస్ రాధాకృష్ణ తెలిపారు. గురువారం కోసిగిలోని విజయ హోటల్ ఫంక్షన్ హాలులో సీపీఎం కోసిగి మండల మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ప్రజలపైన భారాలు మోపుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో ట్రూఅప్ చార్జీలను వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత అవే ట్రూఅప్ చార్జీలను మోపడం దారుణమన్నారు. కోసిగి మండలంలో ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి, రైతులకు పులికనుమ ప్రాజెక్టు ద్వారా ప్రత్యేక తూమును ఏర్పాటు చేసి కోసిగి రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందజేయాలన్నారు. అనంతరం మండల కన్వీనర్‌గా రాముడు, సభ్యులుగా వీరేష్, హనుమంతు, నాగేంద్ర, వీరన్నలను ఎన్నుకున్నారు.

మండల సర్వేయర్‌కు నోటీసులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల సర్వేయర్ వాహిద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ రామాంజనేయులుపై ఆరోపణలు అధికమయ్యాయన్నారు. దీంతో షోకాజ్ నోటీసులు ఇచ్చామని చెప్పారు. గడువులోపు సర్వేయర్ వివరణ ఇవ్వాలని తెలిపామన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పూలే అంబేడ్కర్ సొసైటీ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, గణేష్, కౌన్సిలర్ దయాసాగర్, నరసన్నలు అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలిని బుధవారం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం ఉదయం ప్రభుత్వ వైద్యులు ఆమె ఆరోగ్యాన్ని పరీక్షించి చనిపోయినట్లుగా నిర్ధారించారు. కార్యక్రమంలో అజిత్, పవన్ పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించుకుందాం'



మాట్లాడుతున్న తాలుకా అధ్యక్షుడు జయరాజు

మంత్రాలయం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి అవసరమని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు వగరూరు జయరాజు, జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. గురువారం అబోదే సమావేశ అతిథి గృహంలో మంత్రాలయం నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాలుకా ప్రధాన కార్యదర్శి హుసేనీ, కోశాధికారి సాబువలి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనరేట్ ఏడీఏ కల్యాణ్ కుమార్

ఎమ్మిగనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, గోనెగండ్లలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ కమిషనరేట్ ఏడీఏ కల్యాణ్ కుమార్, ఏఓ సురేష్‌లు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రాంతంలో ఉన్న ఎరువుల వ్యాపారులు గోదాముల్లో ఎరువుల నిల్వలు, ఆయా క్రయవిక్రయాలను పరిశీలించారు. అలాగే ఎరువుల అమ్మకాలపై ఈ పాస్ నమోదు చేస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ ఏడీఏ కల్యాణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా ఈ పాస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ పాస్ నమోదు చేయని పక్షంలో ఎరువుల కేటాయింపులు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మిగనూరు ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ టీచర్‌ను అక్కడే కొనసాగించాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సోషల్ టీచర్‌ను అక్కడే కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ కుమార్, అగ్గిరాముడు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని పార్లపల్లిలోని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న జమీమను వేరే పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో పంపించడం దారుణమన్నారు. 10వ తరగతి చదువుతున్న 46మంది విద్యార్థులకు ఉత్తీర్ణతకు కష్టంగా మారుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు వర్క్ సర్దుబాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రమణీయం.. వెండి గజ వాహనోత్సవం

మంత్రాలయం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదరాయలు వెండి గజ వాహనంపై విహరించారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రహ్లాదరాయలకు పాద పూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. అనంతరం వెండి గజవాహనంపై బంగారు అంబారిలో స్వామివారిని ఏర్పాటు చేసి భక్తుల జయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ భక్తులను ఆకట్టుకుంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది.

శ్రీమఠం అన్నదానానికి రూ. 2 లక్షల విరాళం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన ఉపేంద్ర, గురుదత్తు అనే భక్తులు చెరో లక్ష ప్రకారం రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జ్యోషిలు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ. 2లక్షల విరాళం చెక్‌లను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, శ్రీపాద ఆచార్, గిరిధర్ ఆచార్‌లు పాల్గొన్నారు.


గజ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

ఉచితం మాటున ఇసుక దోపిడీ

అడ్డుకున్న గంజహళ్లి పంచాయతీ కార్యదర్శి, పోలీసులు


హంద్రీ నదిని ఇసుక కోసం తవ్వేసి గుంత చేసిన దృశ్యం

గోనెగండ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు గంజహళ్లి దగ్గర ఉన్న హంద్రీ నదిని తోడుస్తున్నారు. ఆదోని, ఆరేకల్లు, బిల్లెకల్లు, దేవిబెట్ట, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ప్రాంతాల వారు యథేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గంజహళ్లి గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లేదారులు దెబ్బతింటున్నాయని బోరుమంటున్నారు. అలాగే సొంత పనులకు కాకుండా ఇసుకను వ్యాపారం చేస్తున్న 50 ట్రాక్టర్లు ఇసుక కోసం గురువారం గంజహళ్లి హంద్రీనదికి వచ్చాయి. దీంతో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్లను వెనక్కి పంపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి


ఆధార్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బరాజు

కౌతాళం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో 0-6 సంవత్సరాల పిల్లలకు సంబంధిత అంగనవాడీ కేంద్రాల్లోనే ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో గురువారం ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను ఆయా అంగనవాడీ కేంద్రాల్లో చేపడుతున్నట్లు ప్రతి అంగనవాడీ సిబ్బంది తమ పరిధిలోని 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్‌ను తీయించాలని ఆదేశించారు. అనంతరం ఆధార్ ప్రక్రియను పరిశీలించారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి యోగేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ గోవిందు సచివాలయ, అంగనవాడీ సిబ్బంది ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



ఐరంగెల్‌లో మాట్లాడుతున్న డీటీ రుద్రగౌడు

కోసిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐరంగల్ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మంత్రాలయం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు రైతులకు ఉపయోగపడుతాయని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. గురువారం మంత్రాలయం పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు జీకే గురురాజురావు, సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు ఆనంద్, భీముడు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో గురువారం ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో రెవెన్యూ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మహేష్, టీడీపీ నాయకులు మారెప్ప, శంకరమ్మ, గాలెప్పపాల్గొన్నారు.

గోనెగండ్ల: భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. గ్రామ రైతులు తమ భూములలో గతంలో సర్వేలు సక్రమంగా నిర్వహించ లేదని, తమకు రావాల్సి ఉన్న భూమి తక్కువగా ఉందంటూ కొందరు, హద్దులు సక్రమంగా చూపలేదని మరి కొందరు ఇలా పలు రకాల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్ నరసన్న, రీ సర్వే డీటీ శిరీషా, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం


మాట్లాడుతున్న ఆదోని సబ్-కలెక్టర్ మౌర్యా భరద్వాజ్

పెద్దకడుబూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ మండిపడ్డారు. గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన పనివేళలు పాటించని అధికారులు అన్న శీర్షికను చూసిన ఆయన పెద్దకడుబూరు తహసీల్దార్ కార్యాలయన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఎందుకు పనివేళలు పాటించడం లేదని రెవెన్యూ సిబ్బందిని అడిగారు. ఇందుకు స్థానిక రెవెన్యూ అధికారులు నీళ్లు నమిలారు. ఎవరైనా పనివేళలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనాథ్, ఏఎస్‌వో వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ అళ్లప్ప, వీఆర్వోలు పాల్గొన్నారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ట్రామాకేర్ సెంటర్‌ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం రాజధాని అమరావతిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.


వైద్యఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజా సమస్యలపై పోరాడాలి

పెద్దకడుబూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో మూడో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా సీపీఎం నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పరమేష్, తిక్కన్న, దేవదాసు, హనుమంతు, ఈరన్న, వెంకటేశ్వర్లు, రామన్న, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ ప్రధాన అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్, ఖాదర్‌బాషా అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతిర్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, హాజీ, వీరేష్, నరసింహులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

కోసిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ కృపానందంపై చర్యలు తీసుకోవాలని గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ డిమాండ్ చేశారు. మెడికల్ ఆఫీసర్ మనోజ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి, జయశాలి, శివ ఉన్నారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి విజయేంద్ర అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 26 నుంచి సీపీఐ శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీపీఐ జెండాలను ఆవిష్కరించి పల్లెపల్లెన పండగలా శతజయంతి ఉత్సవాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాజీవ్, షమీ ఉల్లా, రామాంజనేయులు, కేసీ జబ్బార్, తిమ్మగురుడు, మాలిక్, బజారి కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుస్తుల పంపిణీ

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్ రిఫార్మ్ చర్చిలో అందరి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన వేడుకల్లో సామాజిక కార్యకర్త మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు 300 మందికి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రవితేజ, కదిరికోట ఆదెన్న, నరసన్న, నాగరాజు గణేష్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకోం

మంత్రాలయం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడితే ఊరుకునేది లేదని బీఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు రామతీర్థ అమ్రేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుడిచిపెట్టాలనే కుట్ర బీజేపీ చేస్తోందని అన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

పెద్దకడుబూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడుబూరులోని ఆయన విలేఖర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదన్నారు.

జాతీయ క్రీడలకు గోనెగండ్ల విద్యార్థిని

గోనెగండ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 19 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గోనెగండ్ల కస్తూర్బా పాఠశాల విద్యార్థిని గొల్ల రాజేశ్వరి తన ప్రతిభ చాటింది. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 14 నుంచి 16 వరకు సత్తేనపల్లిలోని లోయర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో కర్నూలు జిల్లాకు చెందిన అండర్-19 విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో గోనెగండ్లలోని కస్తూర్బా స్కూల్ ఇంటర్ చదువుతున్న రాజేశ్వరి ఈ పోటీల్లో ప్రతిభ కనబచిరింది.


రాజేశ్వరిని అభినందిస్తున్న నిర్వాహకులు